ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025
పేజీలు 08
కర్నూలు

మండల కేంద్రాల్లో రెవెన్యూ గ్రీవెన్స్

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల ప్రజాశక్తిలో రెవెన్యూ శాఖపై వచ్చిన వార్త నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఇక నుండి రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం నిర్దేశించిన మండలంలో రెవెన్యూ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ కూడా హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీలు తీసుకునేటప్పుడు అధికారులు అర్జీ దారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు.. అధికారులపై ప్రజల నుండి వ్యతిరేక స్పందన వచ్చిందన్నారు. సివిల్ సప్లైస్, హాస్పిటల్స్, పారిశుధ్యం టెంపుల్స్ తదితర అంశాల్లో కూడా ప్రజల్లో సానుకూల స్పందనను పెంచేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత వారంలో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో ఎందుకు ఎంట్రీ చేయలేదని కలెక్టర్ వెల్దుర్తి, గూడూరు, కృష్ణగిరి మండలాల తహశీల్దార్లను ప్రశ్నించారు. గురుకులాల జిల్లా కోఆర్డినేటర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సంబంధించి వారి లాగిన్‌లలో ఉన్న కొన్ని అర్జీలను ఇంకా చూడలేదని, ఎప్పటికప్పుడు అర్జీలను చూడాలన్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య,

వార్త 3లో

ప్రజాధనం దుర్వినియోగం

- టిడ్కో గృహాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంపై సిపిఎం విమర్శ

వార్త 8లో

గజ వాహనంపై ఊరేగితున్న రాఘవేంద్రులు

వైభవంగా గురుసార్వభౌముని మధ్యారాధన

- భక్తజన సంద్రం.. రాఘవేంద్రుని స్వర్ణ రథోత్సవం...

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో శ్రీగురు సార్వభౌములైన శ్రీరాఘవేంద్రుల మధ్యరాధనను పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సోమవారం రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా 354వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా మధ్యారాధన నేపథ్యంలో రాఘవేంద్రుని మూర్తిని స్వర్ణరథంపై ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు పుష్పార్చన, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిధ్యాలు, భక్తజన సందోహం మధ్య శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు. పీఠాధిపతులు స్వర్ణ రథోత్సవంపై నుంచి భక్తులకు అభయ హస్తాలతో ఆశీస్సులు అందించారు.

బృందావనానికి మహా పంచామృతాభిషేకం

శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

వార్త 3లో

జన సంద్రం.. ఉరుకుంద క్షేత్రం..!

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం జన సంద్రమైంది. శ్రావణమాసోత్సవాల్లో భాగంగా మూడో సోమవారం భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రావడంతో పుణ్యక్షేత్రం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయానికి సుమారు మూడు కిలోమీటర్ల వరకు భక్తులు వ్యాపించారు. నాలుగు లక్షలకుపైగా భక్తులు రావడంతో ఇసుక వేస్తే రాలనంత రద్దీగా మారింది. శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి నామస్మరణతో పుణ్యక్షేత్రం మార్మోగింది. తుంగభద్ర దిగువ కాలువలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి తడి గుడ్డలతోనే స్వామివారికి ఇష్టమైన నైవేద్యాన్ని వండి పూజలు చేశారు. అనేకమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో దేవాలయ పరిసరాలు సరిపోక ఆదోని, కౌతాళం, కోసిగి, హాల్వి గ్రామాల వైపు కొండలు, గుట్టలు, పంట పొలాలు, చివరికి రోడ్డుపైన నైవేద్యాలు వండి అక్కడే పూజలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వామివారి దర్శనం, తలనీలాలు, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట వద్ద భక్తులు బారులు తీరారు. స్వామివారి దర్శనం కోసం కొన్ని గంటలు పట్టిందంటే భక్తులు ఏ స్థాయిలో తరలివచ్చారో అర్థమవుతుంది. ఆదివారం రోజు భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో అర్ధరాత్రి నుంచే స్వామి దర్శన సౌకర్యం కల్పించారు. డిప్యూటీ కమిషనర్ వాణి, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, దేవాలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న పుణ్యక్షేత్రంలో డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో లక్ష పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం ఇద్దరు భక్తులు దంపతులు ముందుకు రావడంతో వేద పండితులు మురళీ శర్మ, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి డిప్యూటీ కమిషనర్ వాణి చేతుల మీదుగా భక్తులకు శేష వస్త్రాలు, ప్రసాదం అందించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. భక్తుల కోసం బళ్లారి, రాయచూరు, సిరుగుప్ప, ఆదోని, ఎమ్మిగనూరు తదితర డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించారు. సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

ఆర్థిక సాయం అందజేస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని సిద్ధప్పపాలెంలో వెలసిన శ్రీసుగురేశ్వర దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీమహాగణపతి, నందీశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆదోనికి చెందిన వేద పండితులు జగదీశ్ స్వామి, పంచాక్షర స్వామి మూడు రోజుల నుంచి హోమాలు, భవాని పూజ, గోపూజ, రుద్ర కలశ పూజలు, నవగ్రహ పూజలు, అష్ట దిక్పాలక మహా పూజలు, నంది సమారాధన, అంకురార్పణ, నక్షత్రాది పూజలు, శాంతి హోమాలు నిర్వహించారు. స్థానియ నివాసం, జలాధివాసం, వస్త్రాదివాసం ముగించి, వేదమంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాల ప్రతిష్టాపన చేపట్టారు. జీర్ణోద్ధరణ పనులకు ఆలయ కమిటీ, పెద్దల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువనేత వై.ధరణీ రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి సహాయ, సహకారాలతో రూ.50 వేల నగదును వైసిపి మండ నాయకులు ఆలయ కమిటీ పెద్దలకు అందజేశారు. దేవాలయం మరమ్మతుల కోసం స్థానిక దాతల సహాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. మహాగణపతి, నందీశ్వర స్వామి విగ్రహాలను బుక్కిటి వీరేష్ బహుకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉమేష్ గౌడ్, ఉప్పరి లక్ష్మన్న, కృష్ణ, నరసింహులు, కోదండ రవి, వెంకటేశులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి అన్నదానం చేపట్టారు. గాణిగి వీరస్వామి, కొరివి నాగరాజు, కట్టెల నరసింహ, అంజి, ప్రవీణ్ కుమార్, వేమారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం (2025-26)లో 4 కోర్సులతో బిఎ (హిస్టరీ), బికాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (జువాలజీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) ప్రారంభముతుందని తెలిపారు. అడ్మిషన్ కోసం ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు టిసి, స్టడీ ఒరిజినల్, ఇంటర్ మార్కుల జాబితా, పదో తరగతి మార్కుల జాబితా, 6 నుంచి 10వ తరగతి వరకు స్టడీ, క్యాస్ట్, ఇన్‌కమ్, స్టూడెంట్, తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, స్టూడెంట్ బ్యాంక్ అకౌంట్, స్టూడెంట్ తల్లి జాయింట్ అకౌంట్ జిరాక్సులు, స్టూడెంట్ ఫొటోలు 3, సెల్ నెంబరు, మెయిల్ ఐడి కావాలని చెప్పారు. ఇతర వివరాలకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి 9494967069, క్లర్క్ జి.శేఖర్ 9885096890 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

'ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి'

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని బిణిగేరి శ్రీపంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు శ్రీనివాస నాయన తెలిపారు. సోమవారం స్థానిక ములేశ్వర స్వామి ఆలయంలో సర్పంచి మూలింటి రాధమ్మ, జిల్లా కెడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు మల్లికార్జున శర్మ వరుణ యాగం, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీనివాస నాయన రమాదేవి దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. విశ్వనాథ్ రెడ్డి, లక్ష్మీ రెడ్డి, మిథిలా రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి దంపతులు, తహశీల్దారు రామేశ్వర రెడ్డి, ఎంపిడిఒ గీతావాణి, గ్రామస్తులు దత్తాత్రేయరెడ్డి, కేశవరెడ్డి, నరసింహులు, ఉప సర్పంచి వెంకటేశ్వరమ్మ, కృష్ణా రెడ్డి, మహానంది, బాలు, కృష్ణ, రంగనాథ్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

పూర్ణహుతిలో శ్రీనివాస నాయన, తహశీల్దార్ రామేశ్వర రెడ్డి, ఎంపిడిఒ గీతా వాణి

పారిశుధ్య పనుల్లో పంచాయతీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈనెల 8 నుంచి ప్రారంభమైన స్వామి వారి 354వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, కార్య నిర్వహణాధికారి ఉపేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు పురవీధుల్లో పంచాయతీ కార్మికులు చెత్తాచెదారం సేకరించి ట్రాక్టర్ ద్వారా బయటికి తరలిస్తున్నారు. వర్షాలు కురిసి చిత్తడిగా మారినా బురదలో పరిశుభ్రత చర్యలు చేపడుతున్నారు. సోమవారం పన్నగ హోటల్ పక్కన ఉన్న వీధిలో పారిశుధ్య పనులు చేస్తూ చెత్తను ట్రాక్టర్‌లో వేసి బయటకు తరలించారు.

పనులు చేస్తున్న కార్మికులు

దేవనకొండలో హర్ ఘర్ తిరంగ

ప్రజాశక్తి - దేవనకొండ

ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేవనకొండలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగ' నిర్వహించారు. జాతీయ జెండాను ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ రామాంజనేయులు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ గోపాల్, ఎఒ ఉషారాణి, ఏపీవో రాజు నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మురళీ విజయ్, ఎంపిపి భర్త లుముంబా పాల్గొన్నారు.

'ఐడిబిఐ బ్యాంకును బలహీనపరచవద్దు'

ప్రజాశక్తి - ఆదోని

లాభాల బాటలో నడుస్తున్న, రూ.లక్షల కోట్ల రిజర్వులున్న ఐడిబిఐ బ్యాంకును డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని ఎల్ఐసి, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బి, ఐడిబిఐ యూనియన్ల నాయకులు రవిబాబు, ధర్మరాజు, పెన్షనార్ అసోసియేషన్ నుంచి ప్రభాకర్ రావు, శాంతమూర్తి, నరప్ప రావు తెలిపారు. సోమవారం స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట ఎల్ఐసి యూనియన్ అధ్యక్షులు లతా ఆధ్వర్యంలో ఐడిబిఐ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో 2,100 బ్యాంకు శాఖలతో, రూ.4 లక్షల కోట్ల రిజర్వు నిధులతో ఐడిబిఐ పనిచేస్తోందని, పదేళ్ల క్రితం నష్టాల్లో ఉన్న ఐడిబిఐని ఎల్ఐసి కొని దానిని లాభాల బాటలోకి తీసుకొచ్చిందని తెలిపారు. మూడేళ్లలో రూ.10 వేల కోట్ల లాభాలు సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7,026 కోట్ల నిర్వహణ లాభాలను, రూ.209 కోట్ల నికర లాభాన్ని ఐడిబిఐ సాధించిందన్నారు. ఇంత గొప్పగా పని చేస్తున్న ఐడిబిఐని డిసిన్వెస్ట్ చేయాలనుకోవడం దారుణమని విమర్శించారు. యూనియన్ నాయకులు నంజుందేశ్వర్, మల్లిక ఉన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

కురుస్తున్న వర్షాలు...

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చెరువును తలపించిన పాఠశాల ఆవరణం
- వెళ్లేందుకు జంకుతున్న విద్యార్థులు

ఆదోని పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఆదోని

వరుసగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బంది పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఆవుదూడ వంక, మండగిరి వంక, మర్చంట్ క్లబ్ వద్ద పూడిక తీయడం వల్ల మురుగునీరు రోడ్లపైకి చేరడం తగ్గిందని స్థానికులు చెబుతున్నా.. డ్రెయినేజీ లేని శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు ఎక్కువ రోజులు నిలిచి ఉండడం వల్ల ఇబ్బందులు పడుతూనే ఉన్నామంటున్నారు.

పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు - చిన్నారుల ఇబ్బందులు

నిజాముద్దీన్ కాలనీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న ఉర్దూ పాఠశాల ఆవరణం నీటితో చెరువును తలపించింది. పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. 1 నుంచి 5వ తరగతి వరకు 100 మంది విద్యార్థులు, 6 నుంచి 9వ తరగతి వరకు 171 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో అడుగుపెట్టాలంటే నీటిలో నడవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో ఎలా చదువుకునేదంటూ చిన్నారులు ప్రశ్నిస్తున్నారు.

నీటిని తోడాలని అధికారులను కోరాం

- ఫయాజ్ అహ్మద్, కౌన్సిలర్

పాఠశాల ఆవరణలో గత రెండు రోజులుగా నీరు నిలిచి ఉంది. ఆ నీటిలో తరగతి గదిలోకి వెళ్లేందుకు చిన్నారులు జంకుతున్నారు. నీరు నిలవడం వల్ల పాములు వస్తాయన్న భయం చిన్నారుల్లో నెలకొంది. నీటిని మోటార్లతో బయటకు తోడాలని మున్సిపల్ అధికారులను కోరాం. ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో పరిస్థితి అలానే ఉంది. మున్సిపాలిటీ, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

ఉధృతంగా ప్రవహించిన హంద్రీ వాగు

దేవనకొండ : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సోమవారం మండలంలోని తెర్నేకల్ హంద్రీవాగు ఉధృతంగా ప్రవహించింది. తెర్నేకల్ బ్రిడ్జిపై రహదారి గుండా వర్షపు నీరు ప్రవహించడంతో కొన్ని గంటల సేపు బైలుప్పల మీదుగా ఎమ్మిగనూరుకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు ఉధృతంగా రావడంతో హంద్రీవాగు సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆస్పరిలో అత్యధిక వర్షపాతం

ఆస్పరి : పత్తికొండ డివిజన్‌లోని అన్ని మండలాల కన్నా ఆస్పరి మండలంలో అత్యధిక వర్షపాతం (67.2 మిల్లీమీటర్లు) నమోదయింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఆస్పరితో పాటు శంకరబండ, వలగొండ, బిల్లేకలు, బిణిగేరి, కైరుప్పల, చొక్కనహల్లి గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పత్తి, కంది, సజ్జ పంటలు నీటి మునిగాయి. వలగొండ సమీపంలోని తుమ్మలవంక పొర్లి ఏకంగా హనుమంతమ్మ ఇంట్లోకి నీళ్లు చేరాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి.

దేవనకొండ : తెర్నేకల్ బ్రిడ్జి రోడ్డుపై హంద్రీ వాగు

ఆస్పరి

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ జడ్జి కరణం కిశోర్ - క్షేత్ర పర్యటనలో రావూస్ బికాం విద్యార్థులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ జడ్జి ఎం.కరణం కిశోర్ తెలిపారు. పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర శాఖ విభాగాధిపతి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కార్యాలయాన్ని కళాశాలలో చదువుతున్న సెకండ్, థర్డ్ ఇయర్ బికామ్ విద్యార్థులు సందర్శించారు. కరణం కిశోర్, కన్స్యూమర్ మెంబర్ ఎన్.నారాయణరెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ స్టేట్ లీడర్ కుమార్‌తో పాటు అడ్వకేట్స్ అనిదీప్ రెడ్డి, శ్యామ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరణం కిశోర్ మాట్లాడారు. కామర్స్ కోర్స్ చదివే ప్రతి విద్యార్థి వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అలాగే వినియోగదారుల హక్కులు, వాటి వివరణలు తెలుసుకోవడంపై దృష్టి సారించాలని కోరారు. జిల్లా వినియోగదారుల కార్యాలయంలో వినియోగదారుల ఫిర్యాదులు, పిటిషన్లు, వివిధ దాఖలు సాక్ష్యుల వాదోపవాదాలకు సంబంధించిన వివిధ ప్రయోగాత్మక కేసుల పరిశీలనలకు సంబంధించిన వివరాలను విద్యార్థులకు వివరించారు. అలాగే వినియోగదారులకు సంబంధించి విద్యార్థుల్లో ఉన్న అపోహలను తొలగించడానికి విద్యార్థులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. కళాశాల వాణిజ్య విభాగాధిపతి విజయ్ కుమార్, కళాశాల వాణిజ్య సీనియర్ అధ్యాపకులు వీరేష్ మాట్లాడుతూ... ఈ క్షేత్ర పర్యటన విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. కళాశాల తరఫున వినియోగదారులు ఉన్నతాధికారులను కళాశాల కామర్స్ అధ్యాపకులు శాలువాతో సన్మానించారు. వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించిన జిల్లా ఉన్నతాధికారులకు, సహకారమందించిన అడ్వకేట్లు కుమార్, శ్యామ్ కుమార్‌కు, పట్టణ సీనియర్ న్యాయవాది ఎన్.చార్లెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్షేత్ర పర్యటనకు తమను ప్రోత్సహించిన కళాశాల సిఇఒ తిరుమలరెడ్డికి విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల కామర్స్ విభాగాధిపతి విజయ్ కుమార్, కామర్స్ సీనియర్ లెక్చరర్ వీరేష్ పాల్గొన్నారు.

జిల్లా వినియోగ ఫోరం సందర్శించిన రావుస్ బికాం విద్యార్థులు

రహదారి గుంతలమయం

- చిన్న వర్షానికే నీటికుంటలా కైరవాడి రహదారి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలోని ప్రధాన రహదారి చిన్న వర్షానికే నీళ్లు నిలిచిపోయి గుంతలమయంగా మారి నీటికుంటను తలపిస్తోంది.

మసీదు సమీపంలో రహదారిపై నిలిచిన నీరు

గ్రామంలోని ఈ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తులే కాకుండా చిన్ననేలటూరు, పెద్దనేలటూరు, అల్వాల గ్రామాల నుంచి నిత్యం ప్రజలు ఈ రహదారి గూండా రాకపోకలు సాగిస్తుంటారు. మంగళ, బుధవారాల్లో కురిసిన చిన్నపాటి వర్షాలకే కైరవాడి గ్రామం నుంచి పెద్దనేలటూరుకు వెళ్లే రోడ్డు గ్రామంలోని మసీదు సమీపంలో నీరు భారీగా నిలిచి నిదానంగా తగ్గి పోతుంది. అల్లిసాబ్ తాత దర్గా సమీపంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచి కుంటలా మారి వారం రోజులైనా నీరుపోకుండా అలాగే నిలిచి ఉంటుంది. రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులతో పాటు ఆటోలు, సరుకు రవాణా వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు నడిచి వెళ్లేందుకు కూడా బురదలో నడవాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభంలో చిన్నపాటి వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తగిన చర్యలు చేపడతాం

- వి.మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి

గ్రామంలోని కైరవాడి, పెద్దనేలటూరు ప్రధాన రహదారిపై నీరు నిలవకుండా ప్రస్తుతం తాత్కాలిక చర్యలు చేపట్టాం. ప్రస్తుతం నేను శిక్షణలో ఉన్నాను. వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపడతాం.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్

నులి పురుగును నివారిద్దాం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

చిన్నారుల ఆరోగ్యానికి హాని కలిగించే నులి పురుగులను జాగ్రత్తలతో నివారిద్దామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధించిన గోడపత్రికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలు, ఆంగన్వాడీల్లోని పిల్లలందరికీ ఉచితంగా నులి పురుగుల నివారణ మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలకు మందులు అందేలా చూడాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామి రెడ్డి, మెడికల్ ఆఫీసర్ షైనాజ్ బేగం, సబ్ యూనిట్ ఆఫీసర్ మంజునాథ్, ఎంపిహెచ్ఒ లక్ష్మినారాయణ, ఉద్యోగులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి - గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - ఆదోని

బసాపురం గ్రామానికి కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేయాలని టిడిపి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక వర్షాలతో వంక పొంగిపొర్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో వంక పూడిక తీయడం, చెట్లు తొలగించడం వంటి పనులు జరిగాయని, ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో అలాంటి చర్యలు లేవని విమర్శించారు. గ్రామాన్ని ముంపు నుంచి కాపాడేందుకు వంకకిరువైపులా చెట్లు తొలగించి పూడిక తీయాలని, బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

సబ్ కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

గోశాలలో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలలో అగ్ని ప్రమాదం సంభవించింది. సోమవారం గోశాలలో నిప్పంటుకొని సుమారు రూ.లక్ష విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైంది. మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన గోశాల సిబ్బంది వెంటనే గోవులను బయటకు వదలి వేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఎమ్మిగనూరు నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు పశు గ్రాసం మొత్తం బూడిదయింది.

వైభవంగా గురుసార్వభౌముని మధ్యారాధన

మొదటి పేజీ తరువాయి...

మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీమఠంలో సుప్రభాత సేవతో రాఘవేంద్రుని మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పీఠాధిపతులు తానే స్వయంగా మహా పంచామృతాభిషేకం చేసి మంగళహారతులు ఇచ్చారు.

నవరత్న స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనం

శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనం నవరత్న స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి బృందావనాన్ని నవరత్న స్వర్ణ కవచాలతో, వివిధ పూలమాలలు వేసి అందంగా అలంకరించారు. భక్తుల విరాళాలతో తొలిసారిగా గురు సార్వభౌములు నవరత్న స్వర్ణ కవచాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కనువిందు చేసిన మూల రాముల పూజ

రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు నిర్వహించిన విశేష పూజలు భక్తులను కనువిందు చేసింది. శ్రీమఠంలోని పూజా మందిరంలో స్వర్ణ శోభితమైన మండపంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాముల మూర్తులకు పండితుల వేదమంత్రాల మధ్య పుష్పార్చనతో దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న నేపథ్యంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములను చూపిస్తూ ప్రత్యేకతను వివరించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

రాఘవేంద్రస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మధ్యారాధన సందర్భంగా టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, కర్ణాటక ఎంపీ జగ్గేష్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, చిన్న భీమ, విద్యా కమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, నాయకులు గనేకంటి రామకృష్ణ, తిక్కస్వామి గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి యోబు, రాఘవేంద్ర రెడ్డి కుమారుడు ఎన్.రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న వైసిపి నాయకులు

పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులతో ఉన్న తిక్కారెడ్డి

మండల కేంద్రాల్లో రెవెన్యూ గ్రీవెన్స్

మొదటి పేజీ తరువాయి...

డిఆర్ఒ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' కార్యక్రమం

జిల్లాలో గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం పల్లెకు పోదాం కార్యక్రమం త్వరలో నిర్వహించనున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఇందుకోసం 83 మంది అధికారులను నియమించామని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, వైద్య ఆరోగ్యం, అంగన్వాడీ స్కూల్స్, హాస్టల్స్, హౌసింగ్, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులు తనిఖీ చేసి అందుకు సంబంధించిన నివేదికను పల్లెకి పోదాం పోర్టల్‌లో పొందుపరచి, ఆ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు పురపాలక సంఘం

బహిరంగ వేలము తేది: 11.08.2025

Tender Notice No.8/Scrap Materials/Public Auction

ఎమ్మిగనూరు పురపాలక సంఘము ఇంజనీరింగ్ విభాగము నందు పనికిరాని కూర్చీలు, పనికిరాని ఇతర సామాగ్రిలు మొత్తము బహిరంగ వేలము ద్వారా తేదీ 19.08.2025 మంగళవారం నాడు ఉదయం 11.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము వేయబడును.

షరతులు :

1. బహిరంగ వేలము నందు పాల్గొనదలిచిన వారు రూ.1,00,000/-లు డిపాజిట్ చెల్లించవలెను.
2. బహిరంగ వేలము నందు పాటను రద్దు చేయుటకు వాయిదా వేయుటకు కమిషనరు గారికి సంపూర్ణ అధికారము ఉందని గమనించవలెను.
3. ఇతర వివరముల కొరకు ఆఫీసు పనివేళల యందు సంప్రదించవలెను.

కమిషనరు
ఎమ్మిగనూరు పురపాలక సంఘం

IN THE COURT OF THE IV ADDL DT. JUDGE : KURNOOL
I.A.NO.235/2023 IN O.S.NO.89/2016

Nahid Khatoon and another. ...Petitioners
VERSUS
Toufiq Mehdi Khan and another. ...Respondents

Notice to R2 Under Order -1 R-10 R/w R-28 of CRP to R2 (D2)

కె.ఇ.ప్రభాకర్ తండ్రి లేట్ కంబాలపాడు ఈడిగ మాదన్న ఇంటి నెంబర్ 2-30, కంబాలపాడు గ్రామం క్రిష్ణగిరి మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావాలో వాది R2 ను పార్టీగా చేర్చమని (D2) అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 2వ రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణ ఉన్న 25-08-2025వ తేదీన పగలు 10:30 గంటలకు కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిడలా నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

మహమ్మద్‌షాబాజ్,
అర్జిదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE PR.JR.CIVIL JUDGE : KURNOOL
E.P.NO.86/2023 IN. O.S.NO.416/2021

Y.Venkatanarayana Reddy. ...D.Hr
-Vs-
P.Rajinamma. ...J.Dr

వేలం ప్రకటన

పై నెంబర్ E.P లో D.Hr తనకు J.Dr నుండి రావలసిన దావా మొత్తము 15,45,252/- బాకీ తీర్మాణము నిమిత్తము గాను J.Dr తాలుకు షెడ్యూలు ఆస్థిని వేలంనకు తెచ్చినాడు. వేలం వాయిదా 01.09.2025 సవాలు దారులు పై వేలం తేదిన పగలు 10.30 గంటల నుండి జరిగే వేలంలో పాల్గొని సవాలు పొందవచ్చును.

షెడ్యూలు :- Residention House bearing Number H.No.87/1104/4/25 Situated at IVth Class Employees Colony, Ganesh Nagar, Kallur, Kurnool Municipal Corporation, Kurnool Under S.R.O Kallur, In. Sy.No.701 of kallur With Following Boundaries :-
East :- 33 Feet Road, West :- H.No.87/1104/4/24
North :- 33 Feet Road, South:- Plot No.470-B
Market value of the Property Rs.35,21,280/-
D.H.Rs Value of the Property Rs.24,00,000/-
Ameena Value of the Property Rs.45,00,000/-

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఎస్. మురళి కృష్ణ రెడ్డి,
D.H.r పరం అడ్వకేటు,
కర్నూలు.

ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

పెద్ద హ్యాటలో శ్రావణ మాస పూజలు

- వీరభద్రేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో ఉన్న వీరభద్రేశ్వర దేవాలయంలో శ్రావణమాసం మూడో సోమవారం పూజలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరభద్రేశ్వర స్వామికి పూజారులు రాచయ్య, పంపయ్య స్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వీరభద్రేశ్వర స్వామి వేషధారణలో ఇద్దరు యువకులు ప్రవచనాలు చెబుతూ గంగిపూజ, నంది కోలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు.ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

కెజిబివి అభివృద్ధికి కృషి

- విద్యా కమిటీ చైర్మన్ భీమన్న - పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

ఫ్యాన్లు అందజేస్తున్న విద్యా కమిటీ చైర్మన్

ప్రజాశక్తి - నందవరం

కెజిబివి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు విద్యా కమిటీ చైర్మన్ భీమన్న తెలిపారు. సోమవారం ఆయన పాఠశాలకు ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుండి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికైన ఆరు నెలల్లో పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. పాఠశాలలో ఫ్యాన్లు చెడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తనిఖీ చేసిన సమయంలో గమనించామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఫ్యాన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. తన సొంత నిధులు రూ.15 వేలతో 5 ఫ్యాన్లు ఇచ్చినట్లు తెలిపారు. హాలహర్వి గ్రామానికి చెందిన దావీదు కుమారుడు సాగర్ ద్వారా రూ.5 వేలతో 2 ఫ్యాన్లు, నందవరం గ్రామానికి చెందిన మస్తాన్ కుమారుడు, మదీనా ఆటోమొబైల్ ప్రొప్రయిటర్ రహిమాన్ బాష ద్వారా రూ.5 వేలతో 2 ఫ్యాన్లు ఇప్పించినట్లు చెప్పారు. మొత్తం రూ.25 వేలతో 9 ఫ్యాన్లు ఇచ్చినట్లు తెలిపారు. చైర్మన్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపల్ శైలజ, ఎలక్ట్రిషన్ నజీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు, కె.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌టిఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై సిపిఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలకులు, అధికారులు ఎన్‌టిఆర్ కాలనీ అభివృద్ధిని విస్మరించారని, గ్రేడ్-1 మున్సిపాలిటీ అభివృద్ధి అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు. కాలనీలో దాదాపు 20 ఏళ్ల నుంచి బడుగు, బలహీన వర్గాలు, పేదలు నివసిస్తున్నారని తెలిపారు. కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి స్థాపించిన కాలనీని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేదని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్ సందర్శించాలని ఆహ్వానించారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మోహిన్, ఉస్మాన్ వలీ, సుభాన్, బర్మాజీ, నరసింహులు, రెహ్మాన్ పాల్గొన్నారు.

సమస్యలు చూపుతున్న సిపిఎం నాయకులు

స్వామీ..! మా కష్టాలు చూడవయ్యా..!

- క్షేత్రం నలువైపులా ట్రాఫిక్ జామ్..!

ప్రజాశక్తి - కౌతాళం

'శ్రీలక్ష్మీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామీ..! మా కష్టాలు చూడవయ్యా..? ప్రతేడాది క్షేత్రానికి వస్తున్నాం... నీ దర్శనం కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.. ఒక్కసారి చూడవయ్యా..' అంటూ భక్తులు వేడుకుంటున్నారు.

స్వామివారి దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి పుణ్యక్షేత్రానికి ఆటోల్లో, బస్సుల్లో, కార్లలో, ద్విచక్ర వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. కోసిగి రోడ్డులో జుమ్మలదిన్నె, ఆదోని రస్తాలో కామవరం గ్రామం దాటి, కౌతాళం రస్తాలో ఇచనహల్, హాల్వి రోడ్డు వైపు చిరుతపల్లి క్రాస్ వరకు సుమారు 3 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయింది. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం చీకటి పడినా కదలని పరిస్థితి. ఎక్కడ దిగిన భక్తులు అక్కడే నైవేద్యం వండి పొలాల్లో, రోడ్లపైన పూజలు చేశారు. స్వామివారి దర్శనం కోసం వారు పడిన కష్టాలు వర్ణనాతీతం. మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లడానికి మూడు గంటల సమయం పట్టింది. పిల్లలు, వృద్ధులు, మహిళలు వెంట తెచ్చుకున్న సామగ్రితో నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు దారి దొరకక పంట పొలాల్లో, వంకలు, వాగులు దాటి, పిల్లాపాపలతో పడిన కష్టాలు అన్ని ఇన్ని కావు... ఇరుక్కు పోయిన ద్విచక్ర వాహనాలను బయటికి తీయడానికి ఎన్నో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో ఎంత ప్రయత్నించినా ట్రాఫిక్‌ను నియంత్రించలేకపోయారు.

ఇబ్బంది పడిన సిబ్బంది : నలువైపులా వాహనాలు ఎక్కడ నిలిచిన చోట అక్కడే ఆగిపోవడంతో వాహన (ఆర్‌టిసి) డ్రైవర్లు, అక్కడక్కడ విధులు ఇస్తున్న పోలీసులు, అనేకమంది భక్తులకు తాగడానికి నీళ్లు దొరకక, తినడానికి అన్నం దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ భక్తులు వండిన వారి వద్ద భోజనం చేయాల్సిన పరిస్థితి సిబ్బందికి ఏర్పడింది.

ట్రాఫిక్ జామ్‌తో భక్తుల ఇబ్బందులు

కల్యాణకట్టలో బాల కార్మికులు : శ్రావణ మాసోత్సవాల్లో భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణ కట్టలో బాల కార్మికులు పనిచేయడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సోమవారం భక్తులు తల నీలాలు సమర్పించడానికి వెళితే చిన్న వయస్సున్న పిల్లలు గుండు గీయడం చూసి ఆశ్చర్య పోతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారా.. లేదా..? స్వామికే ఎరుక..!

స్నానానికి వెళ్లి భక్తుడు మృతి

ఉరుకుంద సమీపంలోని తిమ్మాపురం గ్రామం వద్ద భక్తుడు స్నానానికి వెళ్లి కాలుజారి బావిలో పడి మృతి చెందారు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో అక్కడున్న గ్రామస్తులు వెంటనే బయటకు తీశారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పెద్దింటి అనిల్ కుమార్ (50) సోమవారం మృతి చెందారు. స్వామి దర్శనానికి వచ్చి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'శక్తి' యాప్ బాలికలకు భరోసా

- ప్రిన్సిపల్ వరదరాజులు, మహిళా పోలీసు గౌరీశ్వరి

ప్రజాశక్తి - చిప్పగిరి

శక్తి టీమ్ యాప్ బాలికలకు భరోసాగా ఉంటుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, మహిళా పోలీసులు గౌరేస్వరి, సుశీల తెలిపారు. సోమవారం చిప్పగిరిలోని జూనియర్ కళాశాలలో 'శక్తి టీమ్ యాప్'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాలికలకు ఎవరి వల్లనైనా ఆపద ఏర్పడినప్పుడు మొబైల్ ఫోన్‌లో శక్తి టీమ్ యాప్ ఉంటే దానిని టచ్ చేస్తే చాలు మీరెక్కడ ఆపదలో ఉన్నది మీ దగ్గరలో ఉన్న స్టేషన్లో శక్తి టీమ్ అధికారులకు తెలుస్తుందని తెలిపారు. బాలికలందరూ శక్తి టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. లెక్చరర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కళాశాల బాలికలకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్, మహిళా పోలీసులు

రోటరీ క్లబ్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రోటరీ క్లబ్‌కు అరుదైన గౌరవం లభించిందని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు సైపుల్లా తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. ఆదోని రోటరీ క్లబ్‌కు నాలుగు అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 3,160 డిస్ట్రిక్ అవార్డ్స్ కార్యక్రమంలో తుంగభద్ర జోన్ క్లబ్ ఉత్తమ అధ్యక్షులుగా సందీప్ రెడ్డికి, ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ సైపుల్లాకు అవార్డులను డీజీ సాధు గోపాలకృష్ణ, రోటరీ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ రవి వడ్లమని చేతుల మీదుగా తీసుకున్నట్లు చెప్పారు. ఫోర్ అవెన్యూ ఆఫ్ సర్వీస్ అవార్డు, తుంగభద్ర జోన్ బెస్ట్ క్లబ్ అవార్డులు రావడం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు ప్రశాంత్ గాంధీ, హితేష్, వినయ్, సాబీర్ పాల్గొన్నారు.

ముజీబ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజీబ్ అహ్మద్‌కు సోమవారం ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. ఫేమస్ సర్కిల్ నుంచి మున్సిపల్ మైదానం వరకు ఊరేగింపుగా చేరుకొని క్రేన్ ద్వారా ఆయనకు గజమాల వేశారు. జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, అభిమాన సంఘం నాయకులు చాంద్ బాషా, శీను ఉన్నారు.

గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ప్రజాధనం నీటి పాలు..!

- ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం
- రోడ్డుపై గుంతలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామంలో రోడ్డు దెబ్బతిని గుంతలు పడింది. వర్షపు నీరు చేరడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం భారీ లోడుతో వందలాది వాహనాలు ఆదోని, పత్తికొండ రోడ్డు మీదుగా రాయచూర్, బెంగళూరుకు వెళ్తుంటాయి. చాలా సార్లు ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలో పడి ఆస్పత్రి పాలైన సంఘటనలూ ఉన్నాయి. రోడ్డు వేసిన ఆరు నెలలకే గుంతలు పడి కుంటను తలపిస్తోంది. ఆర్‌అండ్‌బి అధికారులు వేసిన నాసిరకం రోడ్డుతో ప్రజాధనం 'నీటి'పాలైంది. రోడ్డుపై వర్షపు నీరు చేరి దుర్భరంగా తయారయింది. రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై చేరి గుంతలు పడుతోంది. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి నీరు ఆగకుండా డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు పత్తికొండ ఆర్‌అండ్‌బి అధికారి సునీల్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు.

భయం భయంగా వెళ్తున్న వాహన చోదకులు

తప్పు పట్టిన 'సిద్ధాపురం'

- ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు కరువు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకం సామగ్రి తప్పు పట్టింది. మరమ్మతులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరమ్మతులు చేపట్టి, అందుబాటులోకి తెస్తే ఈ పథకం కింద దాదాపు 200 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.

బీడు భూములు సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాబార్డ్ నిధులతో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించింది. భారీ నీటిపారుదల శాఖ మంత్రి మారెప్ప ఆలూరును సస్యశ్యామలం చేసేందుకు వేదవతి నదిపై ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కానీ ఒకసారి మాత్రమే ఆ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు నీరు అందాయి.

పథకాన్ని ప్రారంభించి రైతులను ఆదుకోవాలి

- ఎపిజె.అబ్దుల్ కలాం యువత నాయకులు లేపాక్షి (సిద్ధాపురం)

పథకానికి మరమ్మతులు చేపట్టి నీరందించాలి. ఆయకట్టు రైతులు, గ్రామం బాగు పడుతుంది.

అనంతరం మరమ్మతులు చేయకపోవడంతో ఆ ఆయకట్టు రైతులందరికీ అన్యాయం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ఎత్తిపోతల పథకం మరమ్మతులు నిధులు మంజూరు చేసి ప్రారంభిస్తే ఆయకట్టు రైతులకు మేలు చేసిన వారు అయితారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా దాదాపు 200 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఎత్తిపోతల పథకం నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. 17 ఏళ్లగా చుక్క నీరు కూడా ఎత్తిపోయడం లేదు. రైతులు తిరిగి బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎత్తిపోతలను అందుబాటులోకి తేవాలి

- హరిజన ఈరన్న రైతు

నాకు మూడెకరాల పొలం ఉంది. మిరప, పత్తి సాగు చేస్తాను. సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తే దాదాపు 200 ఎకరాలు సాగులోకి వస్తుంది.

నులిపురుగుల నిర్మూలనకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆగస్టు 12న నిర్వహించే 20 వ విడత జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల్లో, బాల బాలికల్లో పౌష్టికాహార లోపం , రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నదని తెలిపారు. పిల్లల్లో మల విసర్జన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోకపోవడం వల్ల, కలుషిత ఆహారం తీసుకోవడం, వలన కడుపులోని పేగుల్లో నులి పురుగులు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో నీరసపడిపోతుంటారని తెలిపారు. ఏకాగ్రత లోపించడం, చదువుపై దృష్టి పెట్టలేక పోవడం, రక్తహినత, పోషకాహార లోపం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తి పిల్లల మానసిక, శారీరక పెరుగుదలపై ప్రభావం చూపుతాయని తెలిపారు. నులి పురుగులు సోకిన పిల్లలు బహిరంగంగా మలవిసర్జన చేసినప్పుడు నేల కలుషిత మవుతుందన్నారు. ఆ కలుషిత నేలపై ఆడుకున్న పిల్లల శరీరంలోకి నులి పురుగులు చేరి గుడ్లు ఉత్పత్తి చేసి పేగుల నుంచి పోషకాలను గ్రహించి శరీరంలో నులి పురుగులు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా అనారోగ్యానికి కారణమవుతాయని అన్నారు. నులి పురుగుల సంక్రమణ వ్యాప్తిని అడ్డుకట్ట వేయాలంటే చేతి వేళ్ళ గోర్లను శుభ్రంగా ఉంచుకోని, పరిశుభ్రమైన నీటినే తాగాలని, ఆహారంపై మూతలు ఉంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శాంతికళ

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ రామనాథ రావు మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న బాల బాలికలకు కర్నూలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, స్కూల్స్ , అంగన్వాడి కేంద్రాలలో వసతి గృహాలలో ఈ అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమము వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు సమన్వయముతో 100 శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏదేని కారణం చేత 12 ఆగస్టు మాత్రలు అందని పిల్లలకు ఆగస్టు 20న మాప్ అప్ డే రోజు మాత్రలను పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో ఆర్‌బిఎస్‌కె పిఓ డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్, డిపిఎంఒ డాక్టర్ ఉమా, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, డిపిఒ జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ సంధ్య రెడ్డి, మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి, డిపిఒ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిఇఐసి మేనేజర్ ఇర్ఫాన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

యువతలో హెచ్ఐవి, టిబి, డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టి బి అధికారిని ఆదేశించారు.. హెచ్ఐవి,ఎయిడ్స్ నిర్మూలనకు అమలు చేస్తున్న సమగ్ర వ్యూహాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు

14న జాబ్ మేళా

ఈనెల 14నన కర్నూల్ నగరంలోని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ , జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

ప్రజలు మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు.

ఎన్నికల కమిషన్ తీరు అవమానకరం

-బిజెపి అధికారం కోసం ఎన్నికల కమిషన్‌నే కలుషితం చేశారు

-రాహుల్ గాంధీ అడిగే సందేహాలకు ఈ సి బదులివ్వాలి

-నంద్యాల డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ఎంపి ప్రియాంక గాంధీని, ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలో ఎన్నికల కమిషన్ డిజిటల్ ఓటర్ లిస్ట్ ఇవ్వాలని, ఓటర్ జాబితా తప్పుల తడకతో ఉందని, దాన్ని సరి చేయాలని ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నంద్యాల డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ ఖండిచారు. కర్నూలు నగరం నంద్యాల చెక్పఓస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మి నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు అనేది పునాది లాంటిదన్నారు. అలాంటి ఓటును ఎన్నికల కమిషన్ విలువ లేకుండా ఓటర్ జాబితాను విచ్చలవిడిగా నకిలీ ఓట్లతో, డబుల్ ఓట్లతో, తయారు చేసి బీజేపీ గెలుపునకు సహకరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ఈ దేశములో సమానత్వం ఒక ఓటు మాత్రమే కనిపిస్తుందని, ఒక పూట కూడా తిండి దొరకని పేదవాడికైనా, లక్షల కోట్లు ఉన్న ధనవంతుడికైనా ఓటు దగ్గర సమానమే అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ బిజెపికి కాపు కాస్తున్నదని ఆరోపించారు.మా నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న నంద్యాల డిసిసి అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్

స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకం

మెడికవర్ హాస్పిటల్స్‌లో రూ. 1947కే పూర్తి ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్స్ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఒక ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీని అందిస్తోంది. 'వందే మాతరం హెల్త్ చెకప్ ప్యాకేజీ' పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ ప్యాకేజీ ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని తక్కువ ఖర్చుతో సమగ్రంగా పరీక్షించుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ ప్యాకేజీని రాయలసీమ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ చౌదేశ్వరి మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి సమక్షంలోఈ కార్యక్రమాన్ని ఘనంగా ఆవిష్కరించారు.

మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం రూ. 1947 చెల్లించి ఈ ప్యాకేజీని పొందవచ్చున్నారు. ఈ ప్యాకేజీలో కింద పేర్కొన్న ముఖ్యమైన పరీక్షలు , కన్సల్టేషన్లు అందుబాటులో ఉంటాయన్నారు.

పరీక్షల వివరాలు

కంప్లీట్ బ్లడ్ పిక్చర్: దీనిలో హిమోగ్లోబిన్, ఆర్‌బిసి కౌంట్, హెమటోక్రిట్, ఎంసివి, ఎంసిహెచ్, ఆర్‌డిడబ్ల్యు-సివి, ప్లేట్‌లెట్ కౌంట్, ఎంపివి, డబ్ల్యుబిసి కౌంట్, డిఫరెన్షియల్ కౌంట్ (న్యూట్రోఫిల్, లింఫోసైట్, మోనోసైట్, ఇసినోఫిల్, బాసోఫిల్) , పెరిఫెరల్ స్మియర్ ఉంటాయి.

కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్: ఫిజికల్ ఎగ్జామినేషన్ (కలర్ అండ్ క్లారిటీ), కెమికల్ ఎగ్జామినేషన్ (పిహెచ్, స్పెసిఫిక్ గ్రావిటీ, గ్లూకోస్, ప్రోటీన్, బిలిరుబిన్, కీటోన్ బాడీస్), బ్లడ్, ల్యూకోసైట్స్, యూరోబిలినోజెన్, నైట్రేట్), మైక్రోస్కోపిక్ ఎగ్జామినేషన్ (పస్ సెల్స్, ఎపిథీలియల్ సెల్స్, ఆర్‌బిసి, కాస్ట్స్, క్రిస్టల్స్) ఉంటాయి.

ఫాస్టింగ్ బ్లడ్ షుగర్

లిపిడ్ ప్రొఫైల్: టోటల్ కొలెస్ట్రాల్, హెచ్.డి.ఎల్ కొలెస్ట్రాల్, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్, విఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ , టోటల్ సిహెచ్‌ఒఎల్/హెచ్‌డిఎల్ నిష్పత్తి, ట్రైగ్లిసరైడ్స్ ఉంటాయి.

లివర్ ఫంక్షన్ టెస్ట్ (ఎల్‌ఎఫ్‌టి): అలనైన్ అమైనోట్రాన్స్‌ఫెరేస్ (ఎ.ఎల్.టి/ఎస్.జి.పి.టి), అస్పార్టేట్ అమైనోట్రాన్స్‌ఫెరేస్ (ఎ.ఎస్.టి/.జి.ఓ.టి) టోటల్ బిలిరుబిన్ ఉంటాయి.

ఎక్స్-రే చెస్ట్ (విత్‌అవుట్ ఫిలిం)

ఇసిజి, 2డి ఎకో, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పిఎఫ్‌టి), హెచ్‌బి ఎ1సి

సీరం యూరియా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ (అబ్డొమెన్ అండ్ పెల్విస్)

సీరం క్రియాటినిన్

కన్సల్టేషన్లు : కార్డియాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్,డైటీషియన్ ఈ ప్యాకేజీ ఆఫర్ సెప్టెంబర్ 15 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. పూర్తి వివరాల కోసం 04068334455 నంబరుకు సంప్రదించవచ్చు..

మహిళ సమస్యను వింటున్న ఎస్పి విక్రాంత్ పాటిల్

చట్టపరంగా న్యాయం చేస్తాం

పిజిఆర్ఎస్ కు 81 ఫిర్యాదులు-ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, సమస్యను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 81 ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు.

తల్లిని చంపిన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇటీవల కన్నతల్లిని హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసామని కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ పి.శేషయ్య తెలిపారు. కర్నూలు నగరం బుధవారపేట కు చెందిన రుద్రాక్షల జమ్మన్న తాగుడుకు బానిసగా మారాడన్నారు. ఈనెల 8న మద్యం సేవించేందుకు గాను తనకు డబ్బులు ఇవ్వాలని తల్లి రుద్రాక్షల ఎల్లమ్మ (70)ను వేధించాడు. తల్లి అందుకు ససేమిరా అనడంతో ఆవేశానికి లోనైన నిందితుడు తన తల్లిని హత్య చేశాడు. ఈ మేరకు మృతురాలి మనవరాలు రుద్రాక్షల జ్ఞానేశ్వరి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 135 /2025 అండర్ సెక్షన్ 103 (1) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సోమవారం బుధవార్‌పేట 39వ సచివాలయం విఆర్ఒ సమక్షంలో స్టేషన్లో లొంగిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

వెల్దుర్తిలో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి- వెల్దుర్తి :

వెల్దుర్తిలోని తొమ్మిదవ వార్డులో నివాసం ఉంటున్న మహమ్మద్ రఫీ కాసిమల కుమార్తె సమ్రిన్ డెంగ్యూ బారిన పడినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు ఈనెల 5న తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో వెల్దుర్తి సిహెచ్‌సికి తీసుకొని వెల్లామని అక్కడ నాలుగు రోజులు చికిత్స తీసుకున్నా జ్వరం ఎంతకీ తగ్గకపోవడంతో 9 వ తేదీ వైద్యులు అనుమానంతో మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా సోమవారం రిపోర్టులు రావడంతో పాజిటివ్ గా వచ్చిందన్నారు. అక్కడే ఆసుపత్రిలోబాలిక చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ బాలిక వెల్దుర్తి లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది.

50 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఓర్వకల్లు మండలం గుడుంబాయి తండాకు చెందిన లక్ష్మీ నాయక్ ఆ గ్రామ శివారులో 50 లీటర్ల నాటు సారాను ద్విచక్ర వాహనంపై తరలిస్తూ ఉండగా అరెస్టు చేశామని కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితుని వద్ద నుంచి 50 లీటర్ల నాటుసారతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులలో ఎస్ఐ నవీన్ బాబు, ఈరన్న, మధు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు జేసి అభినందన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుతూ కానిస్టేబుల్స్‌గా ఎంపికయిన అభ్యర్థులను కర్నూలు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, సోమవారం అభినందించారు. అభ్యర్థులు భవిష్యత్తులో ఇంకా మంచి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి. కే ప్రకాష్, అభ్యర్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజీవ్ నగర్ ,ఎల్పిజి నగర్ లలో బోరింగ్ , మురుగు కాలువలు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ పి విశ్వనాథకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలోని 17వ వార్డులోని రాజీవ్ నగర్, ఎల్పిజినగర్‌లో అసంపూర్ణంగా ఉన్న మురుగు కాలువను, బోరింగు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు కె.అయ్యన్న అధ్యక్షతన సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు విజయ రామాంజనేయులు , కాలనీవాసులు కలిసి కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జొహరాపురం రాజీవ్ నగర్, ఎల్పీజీ నగర్‌లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సంబంధించిన పేదలు జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వారికి కొంత మంచినీటి సౌకర్యం, రోడ్లు ఏర్పాటుచేసి , మురుగు కాలువలు నిర్మించక పోవడం వలన మురుగు బయటకు పోకుండా ఇండ్ల మధ్యనే నిలబడి దుర్వాసన వస్తుందన్నారు. ఈగలు, దోమలు కుట్టడం వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. కాలువలు నిర్మాణం కోసం ఇండ్ల ముందు ఉన్న మెట్ల తొలగించడం వలన ముసలి వారు పిల్లలు ఇంట్లోకి వెళ్లడానికి ఇబ్బందిగా మారిందన్నారు. వారు కొన్నిసార్లు కింద పడి కాళ్లు చేతులు ఇరిగాయని గుర్తు చేశారు. కర్నూలు నగరంలో చాలా చోట్ల మున్సిపల్ అధికారులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ డివైడర్లను అనవసరంగా తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని వేసి తెలుగుదేశం కార్యకర్తలకు ఉపాధి చూపిస్తున్నా రని విమర్శించారు. ప్రజలకు అవసరమైన వాటిని పక్కనపెట్టి నగరం సుందరీకరణ పేరుతో ప్రజల సొమ్ము వృధా చేయడం తప్ప అభివృద్ధి జరగడం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు. సంవత్సర కాలం నుండి మున్సిపల్ అధికారులు వచ్చి వెళ్తున్నారు కానీ నిర్మాణంలో ఆగిన మురుగు కాలువలను పూర్తి చేయడం లేదన్నారు. బోరింగులు రిపేర్ చేసి సింటెక్ ట్యాంకులు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం తప్ప ఇప్పటివరకు ఏమి లేదన్నారు. కమిషనర్ జోక్యం చేసుకొని వెంటనే మురుగు కాలువలు పూర్తి చేయించాలని, బోరింగులు రిపేర్ చేయించి, సింటెక్ ట్యాంకులను ఏర్పాటు చేసి కాలనీవాసులకు ఆ సమస్యల నుండి విముక్తి కల్పించాలని కోరారు. లేని పక్షాన కాలనీవాసులనంతా సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుమార్, పురుషోత్తం, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న విజయరామాంజనేయులు

వాలీబాల్ క్రీడాకారులకు షూస్ పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు అవుట్డోర్ స్టేడియం లో వాలీబాల్ శిక్షకుడు రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ట్రైని కలెక్టర్ సురేష్ హాజరై క్రీడాకారులకు షూష్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు చిన్నతనం నుండి క్రీడల్లో సాధన చేస్తే విజయం తథ్యమన్నారు. పోరాటం లేనిదే విజయం రాదని తెలిపారు. ప్రతిరోజు రెండు గంటల పాటు వ్యాయామం చేయాలన్నారు. తమకు కూడా ట్రైనింగ్ లో రెండు గంటల వ్యాయామాన్ని కాల నిర్ణయం పట్టికలో ఏర్పాటు చేశారనీ, క్రీడల్లో మంచిగా రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. మున్ముందు ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి క్రీడల అధికారి భూపతిరావు, శ్రీధర్ రెడ్డి, శిక్షకుడు రవితేజ, ప్రైవేట్ పిఇటిలు చిన్న సుంకన్న, వెంకటేశ్వర్లు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు రవితేజ, రామాంజనేయులు, ఈదన్న, బంటి పాల్గొన్నారు.

యోగాసనాలు తిలకిస్తున్న-జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్

చిన్నతనం నుంచి యోగా సాధన చేయాలి

-జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులు తమ చిన్నతనం నుంచే యోగాను అభ్యసించాలని, తద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో అవుట్‌డోర్ స్టేడియం లో జిల్లాస్థాయి యోగ పోటీలను జిల్లా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి అధ్యక్షతన నిర్వహించారు. డిఇఒ శామ్యూల్ పాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల దినచర్యలో యోగా సాధన భాగం కావాలన్నారు. దీని వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. అనంతరం టోర్నమెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ మొదటి వారంలో ద్వారకా తిరుమలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఈ యోగా పోటీలకు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి మునిస్వామి, ఒలంపిక్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్, జిల్లా యోగ సంఘం సభ్యులు లోకేష్, ఈశ్వర్ నాయుడు, లలన ప్రియ, విశ్వతేజ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మద్యపానాన్ని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని 19, 20 వార్డుల మహిళా సంఘం ఐద్వా రెండవ మహాసభ ఉదయం 10 గంటలకు సోమిశెట్టి నగర్ లోని యుటిఎఫ్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు ఇఎల్ఎస్. రత్నమ్మ అధ్యక్షత వహించారు. ఎన్. అలివేలు, జిల్లా నాయకురాలు పిఎస్. సుజాత మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రపంచంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి మహిళ ఒక తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా తనప్రేమను ,ఆప్యాయతను పంచుతూ సమాజంలో ఒక ప్రత్యేక స్థానం కలిగిన మహిళకు ఈరోజు రక్షణ లేకుండా పోతున్నదన్నారు. వరకట్న వేధింపులు ,అత్యాచారాలు, యాసిడ్ దాడులు, భద్రత లేని జీవితంతో మహిళలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారన్నారు. మహిళలు ప్రభుత్వాలను మద్యపాన నిషేధం చేయాలని అనేకపోరాటాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా మద్యపాన పాలసీని ఇంకా బలోపేతం చేస్తూ ఎక్కువ షాపులను తెరుస్తూ రాత్రి 12 గంటల వరకు పర్మిషన్ ఇస్తూ దుర్మార్గంగా చట్టాలను చేస్తున్నారు. తాగిన మత్తులో పురుషులు మహిళల పైన అత్యాచారాలు దాడులు చేస్తున్నారు. గాంధీజీ కోరుకున్న సమాజం ఒక మహిళ అర్ధరాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి ఒంటరిగా తిరిగి ఇంటికి వచ్చినప్పుడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని చెప్పాడు. కానీ పట్టపగలే తాగిన మత్తులోదౌర్జన్యాలు, అత్యాచారాలు చేస్తుండడంతో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందా యన్నారు. టీవీలలో సిని మాలలో మహిళలను విలన్‌గా చూపించి మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరుస్తున్నా రన్నారు. ఈ సంస్కృతికి వ్యతిరేకంగా మహిళలు పోరా టానికి సిద్ధం కావాలన్నారు. రాబోయేరోజుల్లో మద్యపాన నిషేధం మహిళల రక్షణ కొరకు పోరాటానికి సిద్ధమవు తుందన్నారు. పోరాటంలో మహిళలు పెద్ద సంఖ్యలోపాల్గొనాలని కోరారు.

సిఐటియు నాయకులు ఆర్ నరసింహులు, బి. రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను చిన్న చూపు చూస్తూ మహిళలు వంటింటికే పరిమితం అంటూ మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నా యన్నారు. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విచ్ఛిన్నం చేయడానికి మత ఉన్మాదాన్నిరెచ్చగొడుతున్నారన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజలు, గ్యాస్, కరెంటు, చార్జీలు బస్సు, రైలు చార్జీలు తదితర భారాలు వేసి కుటుంబాలను ఆర్థికంగా కుంగ తీస్తున్నాయన్నారు. 19 ,20 వార్డులలో ఇప్పటికీ తాగునీరు రోజు వదలడం లేదు దీనివలన రాత్రివేళలో మేల్కొని తాగునీరు పట్టుకొనవలసిన పరిస్థితి ఉందన్నారు. తాగునీరు రోజు వదలాలని పోరాటం చేయవలసిన పరిస్థితి ఉందన్నారు. పోరాటంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఐద్వా మహిళా సంఘం17 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా ఇఎల్ఎస్ రత్నమ్మ, వార్డు అధ్యక్షులు బీబీ, కార్యదర్శిగాసుగుణ, ఉపాధ్యక్షులుగా శకుంతలమ్మ, శాలమ్మ, కళావతమ్మ, ముంతాజ్, మేరమ్మ, సహాయ కార్యదర్శిగా నాగమ్మ, సుశీల ,అనురాధ, మేరీ, యమునా ,నన్నెమ్మ, మల్లేశ్వరి ,సోమేశ్వరమ్మ, సంధ్య భాయ్ లను ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు నరసింహులు, వేదికపై ఎన్.అలివేలు

పోలీసులకు రాఖీ కట్టిన విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాఖీ పండుగను పురస్కరించుకొని కర్నూలు తాలూకా పోలీసులకు విద్యార్థులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం తాలూకా పోలీస్ స్టేషన్లో సిఐ ఎం శ్రీధర్ తో పాటు ఎస్ఐలు పీరయ్య రామాంజనేయులు గోపాల్ కు, సిబ్బందికి నన్నూరు బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు రాఖీని కట్టారు. వారికి సిఐ శ్రీధర్ స్వీట్లు పంచిపెట్టారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్తులో మున్ముందుకు రాణించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారికి శక్తిటీము అండగా ఉంటుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మాధురి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిఐ శ్రీధర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థినులు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రభుత్వ స్థలాలు దొంగలు పాలు

ప్రజాశక్తి-మద్దికేర

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు కడవల రవికుమార్, నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తహశీల్దార్ గుండల నాయక్ కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన మద్దికేర తూర్పు లోని సర్వే నెంబర్ 42/1 లో 54 సెంట్లు, 43/ఎ 63 సెంట్లు, ప్రభుత్వ భూమిని విచ్చలవిడిగా ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి అమ్ముతున్నారని అన్నారు. ప్రభుత్వ భూములకు దిక్కే లేకుండా పోయిందన్నారు. ఇష్టాను సారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేయడం జరుగుతుందని చెప్పారు. ఇంత జరిగినప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, 42/1,43/ఎ గల భూమి ఎం. అగ్రహారం గ్రామానికి సంబంధించిన వంక పోరంబోకు సంబంధించిన భూములను సైతం వదలడం లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. దీనిపైన వెంటనే సంబంధించిన అధికారుల స్పందించకపోతే కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మద్దికేర మండల నాయకులు నీలకంఠ, సుంకన్న, చరణ్, సిపిఎం, సిపిఐ తదితర నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా మరోసారి గిడ్డయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పున్నమి ఫంక్షన్ హాలులో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూలు జిల్లా 24 మహాసభలలో కర్నూలు జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శిగా బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శులుగా ఎస్ మునెప్ప, నక్కిలెనిన్ బాబు, తోపాటు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జగన్నాథం, నబీరసూల్, మద్దిలేటి శెట్టి, రాజా సాహెబ్, రామకృష్ణారెడ్డి, లలితమ్మ, శ్రావణి రెడ్డి, పంపన్న గౌడు, భాస్కర్ యాదవ్, జి చంద్రశేఖరు, రంగన్న, విరుపాక్షి, కారుమంచి సుదర్శనం, కె శ్రీనివాసులు, బి.రాజు, కార్యవర్గ సభ్యులు, 65 మంది జిల్లా సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నూతన కమిటీ జిల్లాలో ప్రజా సమస్యల పైన జిల్లా సమగ్ర అభివృద్ధికి నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మున్సిపల్ పార్కు ప్రజలకు ఉపయోగపడాలి

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో ఉన్న పార్కును ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాషా కోరారు. సోమవారం డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి హుస్సేన్ బాషా మాట్లాడుతూ కర్నూలు నగరం నిర్మల్ నగర్ ప్రాంతంలో మున్సిపాలిటీ సంబంధించిన పార్క్ అధికారుల నిర్లక్ష్యం వలన చాలా సంవత్సరాలుగా ఎటువంటి అభివద్ధికి నోచుకోవడం లేదన్నారు. ప్రస్తుతం ఈ పార్క్ తాగుబోతులకు అడ్డాగా మారిందని తెలిపారు. రాత్రి వేళలో ఈ పార్కులలో ఎంతోమంది వచ్చి తాగి మందు సీసాలు అక్కడే పడేసి వెళ్ళిపోతున్నారని, దీనివల్ల చుట్టుపక్కల నివసించే ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పార్క్‌ను ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్ స్పందించి నగరంలోని పార్కులకు ఒక్కో పార్కుకు ఒక వ్యక్తిని కేటాయించి వాటి నిర్వహణ బాధ్యతలు చూసేలా చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ అధికారి విజయలక్ష్మిని ఆదేశించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు రాజా, వీరేశ్ స్థానిక వార్డు నాయకులు వెంకటేష్, దుర్గేష్, గాడెప్ప తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, ఇతర నాయకులు

ప్రజాధనం దుర్వినియోగం

టిడ్కో గృహాలలో ప్రభుత్వ నిర్లక్ష్యపై సిపిఎం విమర్శ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిడ్కోలబ్ధిదారులకు ఇల్లు కేటాయించకుండా ప్రజాధనాన్ని పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ విమర్శించారు. సోమవారం సిపిఎం ప్రతినిధి బృందం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్ ఎన్.అలివేలు, సి.గురు శేఖర్‌లతో కలిసి టిడ్కోఇళ్లలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిట్కో ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు సిపిఎం బృందంతో బాధితులు మాట్లాడారు. వారి మాటల్లో.... 'మాకు తాగడానికి నీళ్లు లేవు. రెండు రోజులకు ఒకసారి ట్యాంకర్ పంపుతున్నారు. ఇక్కడ ఉండే వారికి దొంగల భయం ఉంది. కాపురాలు చేయని ఇండ్ల తలుపులు చెదలు పట్టిపోతున్నాయి. వీధిలైట్లులేవు. కాపురాలు చేయకపోవడంతో పిచ్చి మొక్కలు కంప చెట్లు మొలిచి పాములు కాపురం చేస్తున్నాయి. పాములు ఏ సమయంలో కాటు వేస్తాయో అని భయం భయంగా బతుకుతున్నాం. మాకు రవాణా సౌకర్యం లేదు. వీధిలైట్లు లేవు, మార్కెట్ లేదు. పాఠశాల, వైద్యశాల, అంగన్వాడి కేంద్రం, ఉపాధి సౌకర్యాలు లేవు. ఉపాధి కోసం నగరంలోకి వెళ్లి రావాలంటే రూ.200 చార్జీలు అవుతున్నాయి. విధిలేక ఇక్కడ జీవనం చేస్తున్నాం. డబ్బులు కట్టించుకుని ఇల్లు కేటాయించకపోవడంతో బ్యాంకు వారు నోటీసులు పంపుతున్నారు. అప్పులు తెచ్చి కట్టిన డబ్బులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇటు వడ్డీలు, అటు బాడుగలు కట్టలేక దయ్యాల కొంపల్లో కాపురం చేస్తున్నాం.' అంటూ అక్కడ నివాసం ఉంటున్న బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి, ఇతర నాయకులు మాట్లాడుతూ 2015 నుండి 2016 సంవత్సరం మధ్యకాలంలో ప్రజలు సొంతింటికల నెరవేరుతుందని ఎంతో ఆశతో కోట్లాది రూపాయలు చెల్లించి పది సంవత్సరాలుగా ఎదిరి చూశారన్నారు. వారి సొంతింటి కల నేటికీ నెరవేరలేదని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పాలకుల, ప్రభుత్వఅధికారుల, నిర్లక్ష్యం వలన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే సొంతింటి కల నెరవేరుతుందని ఆశించారు.కిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరి కూలిపోకముందే కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తక్షణమే నిధులు కేటాయించి మరమ్మతులు చేయించి టిట్కో లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని అన్నారు. మౌలిక వసతులైన మంచినీళ్ల ,వీధిలైట్లు, నగరానికి వచ్చి పోయేందుకు బస్సు సౌకర్యం, విద్యార్థులు చదువుకునేందుకు స్కూల్ ఏర్పాట్లను చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే లబ్ధిదారులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జి.రామకృష్ణ , తదితరులు

సీతారామయ్య ఐరన్ ఓర్ లీజును రద్దు చేయాలి

-పుల్లగుమ్మి రైతులకు న్యాయం చేయాలి
-కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా
-రైతుసంఘం జిల్లాకార్యదర్శి జి రామకష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా పుల్లగుమ్మి రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జి .రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, బొల్లవరం కృష్ణ హాజరై మాట్లాడుతూ పచ్చని పొలాల్లో అధికారులు ఏమాత్రం పరిశీలన చేయకుండా ఐరన్ ఓర్ లీజుకు ఇవ్వడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ధ్వజమెత్తారు. పుల్లగుమ్మి రైతులు అత్యంత పేద రైతులు ఒక్కొక్కరికి అత్యంత తక్కువ పొలం ఉన్నది అటువంటి పొలాన్ని కష్టపడి సారవంతంగా తయారుచేసి రెండు కార్లు పంటలు పండిస్తున్న సమయంలో వ్యక్తుల లాభార్జన కోసం ఐరన్ వోర్ లీజు ఇవ్వడం రైతుల కడుపు కొట్టడం తప్ప మరొకటి కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సీతారామయ్యకు ఇచ్చిన లీజును రద్దుచేసి రైతుల పంట పొలాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టర్ స్థాయి అధికారులు కూడా ఒక్కసారి పుల్లగుమ్మి రైతుల పొలాలను పరిశీలన చేసి రైతులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం తహశీల్దార్ ఆంజనేయులుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. విజ్ఞాపన పత్రం తీసుకున్న తహశీల్దారు రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుల్ల గుమ్మి రైతులు లక్ష్మన్న నాగరాజు జనార్ధన్ వెంకటస్వామి రాజు బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.